# కాల్‌మనీ దోపిడీకి వ్యతిరేకంగా ఆందోళన




విజయవాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

**విజయవాడ, 21-12-15 :**

స్త్రీ విముక్తి సంఘటన, ఓ.పి.డి.ఆర్‌ల ఆధ్వర్యంలో కాల్‌మనీ వడ్డీ వ్యాపారాన్ని వ్యతిరేకిస్తూ 21-12-15న వన్‌టౌన్ టైలర్‌పేట జోడుబొమ్మల సెంటర్ నుండి చిట్టినగర్, వాగుసెంటర్, నెహ్రూబొమ్మ, పంజాసెంటర్‌ల మీదుగా ప్రదర్శన, అనంతరం ధర్నా జరిగాయి. ఈ సందర్భంగా పంజా సెంటర్‌లో ఓ.పి.డి.ఆర్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు మాట్లాడుతూ కాల్‌మనీ పేరుతో అధికవడ్డీతో పేద, మధ్యతరగతి, చిరువ్యాపారులను దోపిడీచేయటం నీచమైనదన్నారు. కాల్‌మనీ ముసుగులో మహిళలను బెదిరించి అత్యాచారంచేసి వ్యభిచార కూపంలోకి దించి సెల్‌ఫోన్లతో అసభ్య చిత్రీకరణ చేసి బ్లాక్‌మెయిల్ చేసి లోబరుచుకోవటం దుర్మార్గమైన చర్యలని ఈ చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు సింగంపల్లి లక్ష్మి మాట్లాడుతూ కాల్‌మనీ పేరుతో నూటికి నెలకు 300 రూపాయలు వడ్డీ వసూలు చేయటం దుర్మార్గమైన చర్య అని, సభ్య సమాజం సిగ్గుపడేవిధంగా మహిళలను లోబర్చుకొని వారిని బెదిరింపులకు గురిచేస్తూన్న కిరాతకులకు, వారిని పెంచి పోషిస్తున్న రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. కామేశ్వరి, వి. రాధిక; యువజన సంఘం నాయకులు వి. లక్ష్మణరావు, కె. సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

**రెంటచింతల, 23-12-15 :**

మద్యం ఉత్పత్తి అమ్మకాలను ప్రభుత్వం వెంటనే ఆపివేయాలని, కాల్‌మనీ వ్యాపార ముఠాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో గుంటూరుజిల్లా రెంటచింతలలో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తాశిల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అధికారులకు మెమోరాండం అందచేశారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ ఎం. నిర్మల మాట్లాడుతూ ఏటేటా మద్యం విక్రయాలను పెంచుతూ ఆదాయాన్ని పెంచుకుంటున్న ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా నిరసించారు. సూపర్ లాభాల కాంక్షతో వ్యాపారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై సాగిస్తున్న కల్తీమద్యం వ్యాపారం కష్ట జీవులను నిలువునా బలిగొంటున్నదన్నారు. కాల్‌మనీ వ్యాపారాలతో 'పేదల' ముఖ్యంగా మహిళల మాన ప్రాణాలతో చెలగాట మాడుతున్న ముఠాలను కఠినంగా అణచివేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కా్రమేడ్స్ సూరమ్మ, సైదమ్మ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ooooo